7

# పంచాయతీరాజ్ వ్యవస్థ - అశోక్ మెహతా సిఫారసులు

1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం భారతదేశంలో పంచాయతీరాజ్ సంస్థలు పనిచేస్తున్న తీరుతెన్నులను పరిశీలించి, వాటి అభివృద్ధికి తగిన సూచనలను చేయవలసిందిగా కోరుతూ అశోక్ మెహతా అధ్యక్షతన పద్నాలుగు మంది సభ్యులతో కూడిన ఒక సంఘాన్ని డిసెంబర్ 1977న నియమించింది. అంతేగాక ఈకింద పేర్కొన్న అంశాలను కూలంకషంగా పరిశీలించవలసిందిగా ప్రభుత్వం ఈ కమిటీని ఆదేశించింది. అవి :

1. పంచాయతీ రాజ్ సంస్థల నిర్మాణ పద్ధతులు, ఎన్నికల విధానాలు, వాటి ప్రభావాల పరిశీలన జరపడం;
2. సమగ్ర గ్రామీణాభివృద్ధిని సాధించడంలో పంచాయతీ రాజ్ సంస్థల పాత్ర - దాని లక్ష్యాల సూచనలు చేయడం;
3. పంచాయతీ రాజ్ వ్యవస్థలోని లోపాలను తొలగించడానికి, దానిని పునర్నిర్మించడానికి తగిన సూచనలు చేయడం;
4. గ్రామీణ వికాసానికి తోడ్పడునట్లుగా పంచాయతీరాజ్ సంస్థలు ప్రభుత్వ పాలనా యంత్రాంగానికి సహకార, స్వచ్ఛంద సంస్థల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడానికి తగిన సూచనలు చేయడం;
5. పై విషయాలనే గాక బలహీనవర్గాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికిగాను ప్రణాళికా రచన, ఆచరణ, వనరుల సమీకరణ వంటి విషయాలలో తగు సూచనలు చేయడం మొదలయినవి.

పైన పేర్కొన్న అంశాలను ఈ అశోక్ మెహతా కమిటీ అనేక కోణాల నుంచి పరిశీలించి, తగు సిఫారసులు చేస్తూ తన నివేదికను 1978 ఆగస్టులో ప్రభుత్వానికి సమర్పించింది. ఆ సిఫారసులను కింద పేర్కొనడం జరిగింది.

## అశోక్ మెహతా కమిటీ సిఫారసులు

1. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి జిల్లానే ప్రామాణికంగా తీసుకోవాలి.
2. పంచాయతీ రాజ్ వ్యవస్థ జిల్లా పరిషత్, మండల్ పంచాయతీ అనే రెండు అంచెల పద్ధతిలో ఏర్పాటు కావాలి.
3. గ్రామ స్థాయిలోని గ్రామ సభ ప్రజాస్వామ్య వ్యవస్థకే పునాది. కనుక దానికి ఇదివరకటి లాగే ప్రాధాన్యమిస్తూ కొనసాగించవలె. సంవత్సరానికి ఇది రెండుసార్లు సమావేశమై, తాను సమీక్షించిన విషయాలను మండల్ పంచాయత్‌కు తెలియపరచాలి.
4. ఇదివరకటి న్యాయ పంచాయతీలను కొత్తవాటితో ముడిపెట్టకుండా యధావిధిగా కొనసాగాలి.
5. వ్యవసాయం, మార్కెట్, ఆరోగ్యం, విద్య, రహదారులు, గ్రామీణ పరిశ్రమలు, బలహీన వర్గాల సంక్షేమం, కుటుంబ సంక్షేమం వంటి అన్ని అభివృద్ధికర విధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా పరిషత్తుకు తరలించాలి.
6. జిల్లా పరిషత్తులో ప్రణాళికలను చేపట్టడానికి వీలుగా నిపుణులతో కూడిన ఒక "ప్రణాళిక విభాగం" ఉండాలి. అందులో ఒక ఆర్థిక నిపుణుడు / గణాంక నిపుణుడు / భూగర్భ విషయ నిపుణుడు / కార్టో గ్రాఫర్, ఒక వ్యవసాయ నిపుణుడు, ఒక ఇంజనీరు (నీటి పారుదల లేదా సివిల్ సంబంధమైనవాడు), ఒక పరిశ్రమల నిపుణుడు, ఒక పరపతి ప్రణాళికాధికారి సభ్యులుగా ఉండాలి. ఈ ప్రణాళికా విభాగం జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో పనిచేయాలి.
7. జిల్లా పరిషత్తులో విధుల దృష్ట్యా వివిధ కమిటీలు ఏర్పడాలి. ఆ కమిటీలలో ముఖ్య కమిటీలు వ్యవసాయం, విద్య, చిన్నతరహా పరిశ్రమలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రజా పనులు, సాంఘిక న్యాయం. ఈ కమిటీలు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ద్వారా ఏర్పడాలి. తత్సంబంధ జిల్లా అధికారులు ఆయా కమిటీలకు కార్యదర్శులుగా ఉండాలి.
8. పై కమిటీలలో చైర్మన్‌లు సభ్యులుగా గల ఒక స్థాయీ సంఘం ఉండి, దానికి పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కార్యదర్శిగా ఉండాలి.
9. కార్యక్రమాల ఆచరణకు మండల్ పంచాయతీలు ప్రాథమికంగా ఉండాలి. ఇది బ్లాకుకు దిగువ స్థాయిలో ఉండేది; పంచాయతీరాజ్ వ్యవస్థలో రెండవదీ, చివరిదీను.
10. ప్రతి మండల్ పంచాయతీ 15,000 నుంచి 20,000 జనాభా కలిగి ఉంటుంది. ఇది క్షేత్ర స్థాయి కార్యక్రమాలను సమన్వయపరిచి, నిర్వహిస్తుంది.

11. రాష్ట్ర పరిస్థితులను బట్టి బ్లాకును తాత్కాలికంగా మండల్ పంచాయతీలుగా ఎన్నుకోవచ్చు.
12. పై నిర్మాణ వ్యవస్థ గిరిజన ప్రాంతాలలోను, కొండ ప్రాంతాలలోను, ఎడారి ప్రాంతాలలోను వీలుపడనప్పుడు, ఇదివరకే పనిచేస్తున్న పంచాయతీలను ఎత్తివేయక యధావిధిగా కొనసాగించాలి.
13. పరిషత్‌లోని ఒకటవ, రెండవ తరగతికి చెందిన ఉద్యోగులు రాష్ట్రప్రభుత్వ నియంత్రణలోను; మూడవ నాల్గవ తరగతి ఉద్యోగులు జిల్లా పరిషత్ నియంత్రణలోను పనిచేయాలి.
14. పరిషత్ నియంత్రణలో పనిచేసే అన్ని శాఖల ఉద్యోగులు ముఖ్య కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణలో పనిచేయాలి. ఈ ముఖ్య కార్యనిర్వాహణాధికారియే కార్యాచరణకు బాధ్యుడు.
15. జిల్లా కలెక్టర్ ఇదివరకటి తన అధికారాలను అలాగే నిర్వహిస్తాడు. అయితే, వినియామక విధులు జిల్లా కలెక్టర్, అభివృద్ధి విధులు జిల్లా పరిషత్తు నిర్వహించాలి.
16. జిల్లా పరిషత్తు సిబ్బంది నియామకం కోసం రాష్ట్ర స్థాయిలోగాని, జిల్లా స్థాయిలోగాని స్వతంత్ర ప్రతిపత్తిగల బోర్డు ఒకటి ఉండాలి.
17. జిల్లా పరిధి సాధ్యమైనంతవరకు చిన్నదిగా ఉండాలి. జనాభా ఒక మిలియన్ వరకు ఉండాలి.
18. వెనకబడిన జాతులకు, వెనకబడిన తెగలవారి జనాభా ప్రాతిపదికపై ప్రాతినిధ్యం కల్పించాలి.
19. బలహీన వర్గాల సంక్షేమాన్ని సురక్షితంగా కాపాడటానికి సాంఘిక న్యాయ సంఘాలను ఏర్పాటుచేసి వాటి అధ్యక్ష పదవులను వారి అభ్యర్థులకే అవకాశం కల్పించాలి.
20. అభివృద్ధి కార్యక్రమాలను తరలించినట్లుగానే తత్సంబంధమైన ఆర్థిక వనరులను కూడా జిల్లా పరిషత్తుకు అప్పగించాలి. పన్ను విధింపు అధికారాలతో పాటు స్పష్టత ఏర్పరచాలి.
21. మొత్తం భూమిశిస్తు ఆదాయాన్ని పంచాయతీరాజ్ సంస్థలే క్రమక్రమంగా పొందేట్లు చూడాలి. పచ్చిక బయళ్ళు, బంజరు దొడ్లు, ప్రభుత్వ భూములు, చేపల పెంపక చెరువులు మొదలయిన వాటిపై వచ్చే ఆదాయాలను మండల్ పంచాయతీలకు అప్పగించాలి.
22. మండల్ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు తలసరి రూ. 2.50 పై. చొప్పున ఉండాలి.
23. సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి "జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ'ను ఉన్నత స్థాయి సంస్థగా రూపొందించాలి.
24. మండల్ పంచాయతీ, జిల్లా పరిషత్తులలో స్త్రీలకు రెండు స్థానాలను ప్రత్యేకించాలి.
25. ఈ సంస్థల ఎన్నికలలో రాజకీయ పక్షాలు ప్రత్యక్షంగా పాల్గొనడానికి అవకాశం కల్పించాలి.

26. పంచాయతీ రాజ్ సంస్థల రద్దు, ఎన్నికల విషయాలలో జాప్యం, వాయిదా వేయడం వంటివి జరగరాదు. రద్దు చేయడం, అనివార్యమైనచో తిరిగి ఆరునెలల్లో ఎన్నికలు జరుపాలి.

ఈ విధంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి అశోక్ మెహతా కమిటీ సిఫారసులు చేసినప్పటికి ఈ కమిటీని నియమించిన జనతా ప్రభుత్వం కేంద్రంలో ఎక్కువ కాలం అధికారంలో లేకపోవడంతో ఈ కమిటీ సిఫారసులపై చర్యలు తీసుకోలేకపోయింది.

## పంచాయతీరాజ్ వ్యవస్థ - అశోక్ మెహతా నమూనా

అశోక్ మెహతా కమిటీ రెండు అంచెల వ్యవస్థను సూచించింది. ఈ రెండు అంచెలలో ఒకటి జిల్లా పరిషత్తు, రెండవది మండల పరిషత్తు. వాటి నిర్మాణం గురించి ఈ కింద వివరించడం జరిగింది.

## మొదటి అంచె - జిల్లా పరిషత్తు

అశోక్ మెహతా కమిటీ సూచించిన రెండు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మొదటిది జిల్లా పరిషత్తు. ఇది ఈ కింద పేర్కొన్న ఆరు రకాలైన సభ్యులతో కూడుకొని ఉంటుంది.

1. నిర్దేశించిన నియోజక వర్గాల నుంచి ప్రత్యక్షంగా ఎన్నికయ్యే సభ్యులు
2. పంచాయతీ సమితీల అధ్యక్షులు పదవి రీత్యా సభ్యులు
3. పెద్ద పురపాలక సంఘాల ప్రతినిధులు
4. జిల్లా స్థాయి పురపాలక సంఘ సమాఖ్య నామ నిర్దేశం చేసినవారు
5. జిల్లా పరిషత్తు ఎన్నికల్లో అత్యధిక ఓట్లతో గెలిచిన ఇద్దరు స్త్రీలు
6. గ్రామీణాభివృద్ధిలో ఆసక్తిగల వారు కో-అప్టెడ్ సభ్యులుగా ఉంటారు.

పైన పేర్కొన్న వారిలో కో అప్టెడ్ సభ్యులుగాక ఇతరులందరు కలిసి తమలో ఒకరిని జిల్లా పరిషత్తు అధ్యక్షునిగా ఎన్నుకోవాలి. ప్రతి జిల్లా పరిషత్తు, దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో తమ సభ్యులతో కూడుకొన్న అయిదు కమిటీలను ఏర్పరచుకోవలసి ఉంటుంది. అవి: 1) వ్యవసాయం, 2) విద్య, 3) చిన్నతరహా పరిశ్రమలు, 4) ఆర్థిక వ్యవహారాలు, 5) ప్రజాపనులు. ఈ కమిటీల చైర్మన్‌ల అందరితో కలిపి ఒక స్థాయీ సంఘాన్ని కూడా ఏర్పాటు చేయాలని, పైనుదహరించిన కమిటీలే కాకుండా ప్రతీ జిల్లా పరిషత్తు సాంఘిక న్యాయం కోసం ఒక కమిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నది అశోక మెహతా కమిటీ ప్రత్యేక సూచన.

జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులోని సభ్యులందరితోను, రాష్ట్ర విధాన సభ, విధానమండలి సభ్యులతో పాటు జిల్లా నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యులతో ఒక ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేయాలని అశోకమెహతా కమిటీ సూచించింది.

## రెండవ అంచె - మండల పరిషత్తు

అశోక్ మెహతా కమిటీ సూచనల ప్రకారం మండల పరిషత్తు ఈ కింద పేర్కొన్న సభ్యులతో కూడుకొని ఉంటుంది.

1. గ్రామం, జనాభా ఈ రెండింటి ప్రాతిపదికపైన నేరుగా ఎన్నికైన 15 మంది సభ్యులు
2. వ్యవసాయ సేవా సంఘాల ప్రతినిధులు
3. మండల పరిషత్తు ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు సంపాదించిన ఇద్దరు స్త్రీలు

ప్రత్యక్షంగా ఎన్నికయిన సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్తు అధ్యక్షునిగా ఎన్నుకోవలసి ఉంటుంది. అయితే రాష్ట్రాలు తమ ఇష్టానుసారం అధ్యక్షుడిని ప్రత్యక్షంగా ఎన్నుకోవచ్చని అశోక్ మెహతా కమిటీ సూచించింది. మండల పరిషత్తు కమిటీలకు సంబంధించి సభ్యుల్లోని స్త్రీలందరితోను కూడుకున్న ఒక సంఘం స్త్రీలు-పిల్లల అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించే నిమిత్తం ఏర్పాటు చేయాలని అశోక్ మెహతా కమిటీ సూచించింది.

## గ్రామ సంఘం - గ్రామ సభ

అశోక్ మెహతా కమిటీ ఈ కింది సభ్యులతో కూడుకొన్న గ్రామ సంఘాలను కూడా ప్రతి గ్రామం ఎన్నుకోవాలని సూచించింది. అవి :

1. ఆ గ్రామ ప్రాంతం నుంచి మండల పరిషత్తుకు ఎన్నికైన సభ్యులు
2. ఆ గ్రామ ప్రాంతంనుంచి జిల్లా పరిషత్తుకు ఎన్నికైన సభ్యులు
3. ఆ గ్రామ సన్నకారు రైతుల ప్రతినిధులు

ఈ గ్రామ సంఘానికి ఆ గ్రామం నుంచి ఎన్నికైన మండల పరిషత్తు సభ్యుడు అధ్యక్షత వహిస్తాడు.

అశోక మెహతా కమిటీ గ్రామ సభలను ప్రోత్సహించాలని అభిప్రాయ పడింది. ప్రతి సంవత్సరం గ్రామ సంఘాలు రెండు సార్లు గ్రామ సభలను ఏర్పాటు చేసి మండల పంచాయత్ జరిపే కార్యక్రమాలను వివరించి, ప్రజాభిప్రాయాలను మండల పరిషత్తుకు తెలియజేయాలి. పైన పేర్కొన్న వ్యవస్థలతోపాటు న్యాయ పంచాయతీలను కూడా ఏర్పాటు చేయాలని అశోక్ మెహతా కమిటీ సూచించింది. అంతేగాక పంచాయతీలకు జరిగే ఎన్నికలను రాజకీయ పార్టీలకు ప్రవేశం కల్పించాలని కూడా అశోక్ మెహతా కమిటీ అభిప్రాయపడింది.

## పంచాయతీరాజ్ సంస్థల విధులు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయిలో నిర్వహించే అభివృద్ధికి సంబంధించిన నిధులనన్నిటినీ జిల్లా పరిషత్తులకు అప్పగించాలి. ఈ విధంగా వికేంద్రీకరించవలసిన విధులలో వ్యవసాయం దాని అనుబంధ విధులు ఆరోగ్యం, విద్య, రోడ్లు, గ్రామీణ పరిశ్రమలు, వెనకబడిన తరగతుల సంక్షేమం మొదలయిన విధులను కమిటీ ప్రత్యేకంగా పేర్కొంది. జిల్లా స్థాయికి వికేంద్రీకరించిన రాష్ట్ర కార్యక్రమాలను, ప్రణాళికా రూపకల్పనను జిల్లా పరిషత్తుకు అప్పగించగా వాటి అమలును మాత్రం మండల పరిషత్తులకు అప్పగించడమైంది. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనేటట్లు చేసే బాధ్యతనూ పౌరసేవా విధులను, సంక్షేమానికి సంబంధించిన విధులను కూడా మండల పరిషత్తుకు అప్పగించడం జరిగింది.

రెవిన్యూ, శాంతి భద్రతల వంటి వినియామక విధులు కలెక్టర్ వద్దనే ఉండాలనీ, అభివృద్ధి పనులకు అవసరమైనంత వరకు మాత్రమే అవి పంచాయతీ రాజ్ వ్యవస్థలకు ఇవ్వాలనీ అశోక మెహతా కమిటీ సూచించింది. జిల్లా స్థాయిలో ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన పనులను మొత్తం జిల్లా పరిషత్తకే అప్పగించాలి. జిల్లా పరిషత్తుకు చెందిన అభివృద్ధి శాఖల అధికారులను జిల్లా పరిషత్తుకు చెందిన ప్రధాన కార్యనిర్వహణాధికారి అధీనంలో ఉంచాలి. ప్రతి మండల పంచాయత్‌లో వ్యవసాయ విస్తరణాధికారి, పశుపోషణ, చేపల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు, ఆరోగ్యశాఖలకు సంబంధించిన ఉద్యోగులందరినీ ఒక పూర్తి కాల మండల పరిషత్తు కార్యనిర్వాహణాధికారి ఆధీనంలో ఉండాలని అశోక్ మెహతా కమిటీ పేర్కొంది.

అశోక్ మెహతా కమిటీ పంచాయతీరాజ్ సంస్థలకు కొన్ని తప్పనిసరిగా పన్ను విధించే అధికరాలుండాలంటూ ఉదాహరణకు ఇంటి పన్ను, వృత్తి పన్ను, వినోదపు పన్ను మొదలైన వాటిని కమిటీ సూచించింది. ఇవిగాక వీధిదీపాలు, పరిశుభ్రత, నీటి సరఫరా వంటివాటిపై ఫీజు విధించాలని, స్టాంపు డ్యూటిలాంటి మరి కొన్నింటికి సంబంధించిన డ్యూటీలను విధించాలని, ఇవి అన్నీగాక తలసరి కనీసం రూ. 2.50 ల చొప్పున మండల పరిషత్తులకు రాష్ట్రప్రభుత్వం గ్రాంటు మంజూరు చేయాలని కూడా అశోక్ మెహతా కమిటీ పేర్కొంది.

## ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ

1986లో ఆంధ్రప్రదేశ్‌లో మండల పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అశోక్ మెహతా కమిటీ సూచించిన విధంగా మండల పంచాయతీ వ్యవస్థ లేదు. దాని గురించి ఈ కింద వివరించడం జరిగింది.

గ్రామ స్థాయి: గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీల స్థాపనను అశోక మెహతా కమిటీ ఆమోదించలేదు. కాగా ప్రతి గ్రామంలోను పై స్థాయీ సంస్థకు ఎన్నికైన సభ్యులతో కూడుకొన్న

గ్రామ సంఘాలు ఉండాలని కమిటీ సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ పంచాయతీలు మాత్రం 1986 సంవత్సరానికి ముందున్న విధంగానే పనిచేస్తున్నాయి. ఇది అశోక మెహతా కమిటీ సూచనలకు ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవస్థకూ ఉన్న ప్రధానమైన తారతమ్యం. కానీ అశోక మెహతా కమిటీ సూచించిన విధంగానే, ఇంతకు పూర్వమున్నట్లే ప్రతి గ్రామానికి గ్రామసభలు మాత్రం పనిచేస్తూ నేటికి కొనసాగుతూ ఉన్నాయి.

**మండల స్థాయి:** మండల స్థాయిలో అశోక్ మెహతా కమిటీ సూచనలకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న వ్యవస్థకు అనేక రకలైన భేదాలున్నాయి. అశోక మెహతా కమిటి ప్రతి 15 వేల నుంచి 20 వేల జనాభాకు ఒక మండల పంచాయతీ ఉండాలని సూచించగా ఆంధ్రప్రదేశ్‌లోని మండలాల్లో 35 వేల నుంచి 55 వేల వరకు జనాభా ఉంది. మండల పంచాయతీ ఏర్పాటులో కూడా చాలా మార్పులు ఉన్నాయి. అశోక మెహతా కమిటీ గ్రామాలనుంచి నేరుగా ఎన్నికయ్యే సభ్యులను మాత్రమే ప్రధానంగా సూచించగా, ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి సభ్యులతో పాటు ఆ ప్రాంతంలోని పంచాయతీ సర్పంచులూ ఆ ప్రాంతం నుంచి ఎన్నికైన రాష్ట్రశాసనసభ సభ్యులూ, పార్లమెంటు సభ్యులు కూడా పదవీరీత్యా మండల పంచాయత్‌లో సభ్యులుగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ చట్టం పేర్కొంది. అశోక మెహతా కమిటీ రైతు సంఘాలు, స్త్రీలకు మాత్రం మండల పంచాయతీ సభ్యత్వం ప్రతిపాదించగా, ఆంధ్రప్రదేశ్‌లో అందుకు భిన్నంగా మత రీత్యా గానీ, భాషారీత్యాగానీ ఉన్న అల్ప సంఖ్యాకుల ప్రతినిధి ఒక్కరిని కోఆప్ట్ చేసుకోవాలని నిర్ణయించింది. మండల పంచాయత్ అధ్యక్షునికి సంబంధించి అశోక మెహతా కమిటీ నేరుగా ఎన్నికైన సభ్యులు తమలో ఒకరిని ఎన్నుకోవాలని ప్రతిపాదించగా, ఆంధ్రప్రదేశ్‌లో అతడిని, మండల ప్రాంతంలోని ఓటర్లందరూ నేరుగా ఎన్నుకొంటారు. దీంతో పాటు షెడ్యూల్డు కులాలకు 15 శాతం, షెడ్యూల్డు తెగలకు 6 శాతం, వెనకబడిన కులాలకు 20 శాతం, స్త్రీలకు 9 శాతం మండల ప్రాంతంలోని అధ్యక్ష పదవుల్లో రిజర్వేషన్లు కల్పించారు. అశోక మెహతా కమిటీ తాత్కాలికంగా స్థానిక శాసన సభ్యుని అధ్యక్షతన పంచాయతీ సమితీలు కొన్నాళ్ళు సాగాలని సూచించగా, ఆ ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించలేదు.

## జిల్లా స్థాయి

జిల్లా పరిషత్ విషయంలో కూడా అశోక మెహతా కమిటీ సిఫారసులకు ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా పరిషత్ విషయంలో కూడా అశోక మెహతా కమిటీ నేరుగా ఏర్పరచిన జిల్లా పరిషత్‌లకూ ముఖ్యమైన తేడాలున్నాయి. అశోక మెహతా కమిటీ నేరుగా ఎన్నికైన సభ్యులు, పంచాయతీ సమితి అధ్యక్షులు, మునిసిపాలిటీలు, సహకార సంఘాలు, స్త్రీలు మొదలైన వాటి ప్రతినిధులు కొందరు కో ఆప్టెడ్ సభ్యులుండాలని సూచించగా, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయత్ సమితి అధ్యక్షులతో పాటు శాసన సభ్యులు, జిల్లా నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టరు వీరితో పాటు మతరీత్యగాని, అల్ప సంఖ్యాకులకు చెందిన

ఒక కో అప్టెడ్ సభ్యుడు, జిల్లా పరిషత్‌లో సభ్యులుగా ఉంటారు. ఇదిగాక జిల్లా పరిషత్ అధ్యక్షున్ని, సభ్యులు పరోక్షంగా ఎన్నుకోవాలని అశోక మెహతా కమిటీ సూచించగా, ఆంధ్రప్రదేశ్‌లో అతడిని జిల్లాలోని ఓటర్లందరు ఎన్నుకొంటారు. అదీగాక షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, వెనకబడ్డ జాతులు, స్త్రీలకు మండల పంచాయత్‌లో మాదిరిగా అధ్యక్ష పదవికి సీట్లు ప్రత్యేకీకరించడం జరిగింది. అశోక మెహతా కమిటీ సూచించిన జిల్లా పరిషత్ అతిశక్తిమంతమైన అభివృద్ధి యూనిట్ కాగా ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా పరిషత్ ఎక్కువగా సమన్వయ, పర్యవేక్షక విధులను మాత్రమే నిర్వహిస్తుంది.

ముగింపు : 1959 నవంబరు 1వ తేదీన పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభమైన నాటినుంచి ఆ వ్యవస్థలో ఎన్నో మార్పులు చేర్పులు సంభవించాయి. ముఖ్యంగా 1977లో నూతనంగా అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం ద్వారా ఏర్పాటైనా అశోక్ మెహతాకమిటి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక సిఫారసులను చేసినప్పటికి జనతా ప్రభుత్వం ఎక్కువ కాలం ఆధికారంలో లేకపోవడం వల్ల ఈ సిఫారసులు కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయి.